'నానో'పై అవగాహన ఏది?

- నానో యూరియా వినియోగంపై అనాసక్తి
- ఎలా వాడాలో తెలియని రైతులు
- అవగాహన కల్పిస్తేనే మేలు


నానో యూరియా

బోథ్: మారుతున్న కాలానికనుగుణంగా వ్యవసాయరంగం ఆధునిక టెక్నాలజీని అందిపుచ్చుకుని కొత్త పుంతలు తొక్కుతోంది. సాగులో ఖర్చులు తగ్గించి అధిక దిగుబడి సాధించేందుకు విప్లవాత్మక మార్పులు చోటు చేసుకుంటున్నాయి. రైతుల పంటలకు వేస్తున్న గుళికల రూపంలో ఉన్న యూరియా వల్ల భూసారం దెబ్బతింటుంది. యూరియా వినియోగాన్ని తగ్గించేలా నానో యూరియా (ద్రవ రూపంలో)ను అందుబాటులోకి వచ్చింది. కానీ వీటి వినియోగంపై అన్నదాతల్లో సరైన అవగాహన లేకపోవడంతో కొనుగోలుకు ఆసక్తిచూపడం లేదు. ఎలా వినియోగించాలి, పంటకు ఎంత మేర అందుతుందనే దానిపై అవగాహన కొరవడింది. సాధారణ యూరియాను చల్లడం మాత్రమే తెలుసు. అయితే నానో యూరియా ప్రయోజనాలు, వినియోగం వివరాలను రైతులకు వ్యవసాయాధికారులు, శాస్త్రవేత్తలు తెలియజేయాల్సిన అవసరం ఉంది.

నానో యూరియాతో ప్రయోజనాలెన్నో..

నానో యూరియాతో రైతులకు అనేక ప్రయోజనాలు ఉన్నాయి. సాధారణ యూరియాను పంటకు చల్లడం ద్వారా 30 శాతం మాత్రమే వెళ్తుందని అధికారులు పేర్కొంటున్నారు. యూరియా ఖర్చు ఎక్కువ. నానో యూరియాతో తక్కువ ఖర్చు ఉంటుందని, 80 శాతం పంటకు వెళ్తుందని చెబుతున్నారు. అరలీటర్ సీసాలో లభించే నానో యూరియా 45 కిలోల యూరియా బస్తాతో సమానం. రాయితీ పోను బస్తా ధర రూ.266 ఉండగా, నానో యూరియా రూ.240కే లభ్యమవుతుంది. సాధారణంగా ఒక ఎకరాకు అర లీటర్ నానో యూరియా సరిపోతుందని వ్యవసాయాధికారులు అంటున్నారు. యూరియా తర్వాత రసాయన నానో డీఏపీని అందుబాటులోకి తెచ్చారు. ఒక బస్తా డీఏపీకి 500 మిల్లీలీటర్ల నానో డీఏపీ సీసాతో సమానం. బస్తా డీఏపీ ధర రూ.1350 ఉండగా, నానో డీఏపీ రూ.600కే లభిస్తుంది. ఖర్చు తక్కువతో పాటు పంటకు కావాల్సిన యూరియా సరిపడా అందుతుందని అధికారులు పేర్కొంటున్నారు.

అవగాహన కల్పిస్తే రైతులకు మేలు

జిల్లా వ్యాప్తంగా రైతులు 5,79,546 ఎకరాల్లో వివిధ పంటలు సాగు చేస్తున్నారు. దాదాపు 90 వేల మెట్రిక్ టన్నుల వివిధ రకాల ఎరువులు అవసరం ఉంటుంది. ఎరువుల ధరలు రైతులకు భారంగా మారుతున్నాయి. ఈక్రమంలో నానో యూరియా రైతులకు వరంగా మారింది. అయితే చాలామంది రైతులు అవగాహన లేక నానో యూరియాను వాడటానికి ఇష్టపడటం లేదు. వ్యవసాధికారులు గ్రామాలకు వెళ్లి నానో యూరియాపై రైతులకు అవగాహన కల్పించాల్సిన అవసరం ఉంది. ధర తక్కువగా ఉండటంతో వారికి భారం తగ్గే అవకాశం ఉంటుంది.

అవగాహన కల్పిస్తాం



నానో యూరియా వాడకంపై రైతులకు క్షేత్ర స్థాయిలో అవగాహన కల్పిస్తున్నాం. సాధారణ యూరియా కంటే నానో యూరియా వాడకంతో మేలు చేకూరుతుంది. పలువురు రైతులు ఇప్పటికే నానో యూరియాను వాడుతున్నారు. పంటలకు నానో యూరియా ఎక్కువ మొత్తంలో త్వరగా చేరుతుంది. పంట వేసిన ఒక నెల తర్వాత నానో యూరియా వాడాలి.

– శ్రీధర్ స్వామి, డీఏవో, ఆదిలాబాద్


దిగువకు వెళ్తున్న వరదనీరు

'మత్తడివాగు' రెండు గేట్లు ఎత్తివేత

తాంసి: వరుసగా కురుస్తున్న వర్షాలకు వడ్డాడి వద్ద మత్తడివాగు ప్రాజెక్టులోకి వరదనీరు చేరుతుంది. సోమవారం రాత్రి ఇన్‌ఫ్లో ద్వారా 4870 క్యూసెక్కుల నీరు రాగా, అధికారులు మంగళవారం రెండు గేట్లను ఎత్తి 5416 క్యూసెక్కుల నీటిని దిగువకు వదిలారు. ఇన్‌ఫ్లో ద్వారా వరద నీరు తగ్గడంతో ఉదయం 11 గంటలకు రెండు గేట్లు మూసివేశారు. పూర్తిస్థాయి నీటిమట్టం 277.50 మీటర్లకు 277.10 మీటర్ల వద్ద నీరు నిల్వ ఉన్నట్లు ఏఈ హరీశ్‌కుమార్ తెలిపారు.

పెరటికోళ్ల పెంపకంతో జీవనోపాధి


పెరటి కోళ్లు అందిస్తున్న ఐకేపీ ఏపీఎం చంద్రశేఖర్

తలమడుగు: మహిళా సంఘాల సభ్యులను ఆర్థికంగా అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం వారికి పెరటి కోళ్ల పెంపకం ద్వారా జీవనోపాధి పొందవచ్చునని ఐకేపీ ఏపీఎం చంద్రశేఖర్ తెలిపారు. మండలంలో 64 మంది స్వయం సహాయక సంఘాల సభ్యులకు మంగళవారం 1088 పెరటి నాటుకోళ్ల కోడి పిల్లలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ మహిళల కోసం ప్రభుత్వం మహిళా శక్తి పథకం ద్వారా ఆర్థిక రుణాలు అందిస్తోందన్నారు. ఇందులో భాగంగా మండలంలో ఒక్కొక్క స్వయం సహాయక సంఘ సభ్యురాలకు రూ.2 వేల చొప్పున 17 నుంచి 20 కోడి పిల్లలను అందిస్తున్నామని తెలిపారు. వీటి ద్వారా ఇంటి ద్వారానే ఉపాధి పొందవచ్చనని అన్నారు. వసుంధర మండల సంఘం అధ్యక్షురాలు ప్రమీల, కోశాధికారి సోంబాయి ఐకేపీ సీసీలు సమత, ఆనంద్ రెడ్డి, రమేశ్, స్వామి, మోహన్ పాల్గొన్నారు.

వేతనాలు చెల్లించాలని వినతి


రిమ్స్ డైరెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న కార్మికులు

ఆదిలాబాద్‌టౌన్: రిమ్స్‌లో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికులు, సెక్యూరిటీగార్డులు, పేషెంట్ కేర్ల పెండింగ్ వేతనాలు చెల్లించాలని రిమ్స్ డైరెక్టర్ జైసింగ్ రాథోడ్‌కు కార్మికులు వినతిపత్రం అందజేశారు. మంగళవారం ఆయన చాంబర్‌లో కలిసి సమస్యలను విన్నవించారు. జూలై, ఆగస్టు నెల పెండింగ్ వేతనం చెల్లించేలా చూడాలని కోరారు. అదేవిధంగా పీఎఫ్, ఈఎస్ఐ ఖాతాల్లో జమ చేసేలా చూడాలని విన్నవించారు. ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి దేవేందర్, ముజీబ్, ఖాసిమ్, ఇర్ఫాన్ ఖాన్, వెంకటేశ్, జక్కుల రాము తదితరులు ఉన్నారు.

'108' వాహనం తనిఖీ


తనిఖీ చేస్తున్న జిల్లా మేనేజర్ సామ్రాట్

తాంసి: మండల కేంద్రంలో 108 వాహనాన్ని జిల్లా పోగ్రాం మేనేజర్ సామ్రాట్ మంగళవారం తనిఖీ చేశారు. వార్షిక తనిఖీల్లో భాగంగా అంబులెన్స్ పనితీరు, వైద్య పరికరాలు, రిజిస్టర్‌ను పరిశీలించారు. ప్రజలకు మెరుగైన సేవలందిస్తున్న సిబ్బందిని అభినందించారు. అత్యవసర పరిస్థితుల్లో అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. జిల్లా మేనేజర్ రాజశేఖర్, ఈఎంటీ వంశీ, గజానన్, పైలట్లు పొచ్చన్న, రాకేశ్ ఉన్నారు.

గర్భిణులపై దృష్టిసారించాలి


సూచనలు ఇస్తున్న మనోహర్

ఇంద్రవెల్లి: గ్రామీణ ప్రాంత గర్భిణులపై ప్రత్యేక దృష్టి సారించాలని ఏజెన్సీ అదనపు వైద్యాధికారి కుడ్మేత మనోహర్ అన్నారు. మండలకేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రిని మంగళవారం సందర్శించారు. వైద్యసిబ్బందితో మాట్లాడి రోగులు, గర్భిణులు వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఆరోగ్య ఉప కేంద్రాల్లో వైద్యశిబిరాలు ఏర్పాటు చేయాలన్నారు. ఏఎన్ఎంలు, ఆశవర్కర్లు ప్రజల ఆరోగ్యం పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. వైద్యురాలు పూజిత, వైద్యసిబ్బంది తదితరులు ఉన్నారు.

టీఎల్ఎం మేళా


మేళా ప్రారంభిస్తున్న ఎంఈవో బిక్కు

ఇచ్చోడ: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ పాఠశాలలో మంగళవారం మండలస్థాయి టీఎల్ఎం మేళాను ఎంఈవో కాసావత్ బిక్కు ప్రారంభించారు. వివిధ పాఠశాలల ఉపాధ్యాయులు టీఎల్ఎంను ప్రదర్శించారు. వీటిలో పది ఎంపిక చేసి జిల్లాస్థాయికి పంపించనున్నట్లు ఎంఈవో తెలిపారు. ఎమ్మార్సీ సిబ్బంది, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఎన్‌సీసీలో ప్రవేశాలకు ఎంపిక పోటీలు


ఎంపికైన విద్యార్థులతో ఎన్‌సీసీ అధికారులు

ఆదిలాబాద్: జిల్లా కేంద్రంలోని ఇందిరా ప్రియదర్శిని స్టేడియంలో మంగళవారం ఎన్‌సీసీలో ప్రవేశాల కోసం ఎంపిక పోటీలు నిర్వహించారు. గిరిజన పురుషుల, ఆర్ట్స్ అండ్ కామర్స్, నలంద డిగ్రీ కళాశాలల్లో ఫస్టియర్ చదువుతున్న విద్యార్థులు పోటీల్లో పాల్గొన్నారు. లెఫ్టినెంట్ లక్ష్మణ్ మాట్లాడుతూ ఎన్‌సీసీ ఎంపిక కోసం డ్రిల్, పరేడ్, ఫైరింగ్, శరీరధారుఢ్య పరీక్షలు నిర్వహించినట్లు పేర్కొన్నారు. ఎన్‌సీసీ బీ సర్టిఫికేట్ కోసం సెలక్షన్స్ నిర్వహించినట్లు వివరించారు. గిరిజన పురుషుల డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ శివకృష్ణ ఉన్నారు.

త్వరలో భీం విగ్రహం ఏర్పాటు

తలమడుగు: బరంపూర్ గ్రామంలో త్వరలో కుమురం భీం విగ్రహం ఏర్పాటు చేస్తామని ఆదివాసీ జిల్లా నాయకుడు కుమ్ర జ్ఞానేశ్వర్ తెలిపారు. గ్రామంలో భీం విగ్రహం ఏర్పాటుపై గ్రామస్తులతో మంగళవారం చర్చించినట్లు తెలిపారు. భీం విగ్రహ నిర్మాణ కోసం స్థలాన్ని చూపాలని పంచాయతీ కార్యదర్శిని గ్రామపెద్ద ముడుపు కేదేశ్వర్‌రెడ్డి కలిశారు. పొచ్చన్న, భుజంగరావు, అశోక్, మాజీ సర్పంచ్ ప్రభాకర్, శంకర్, రాంచందర్, నాగేశ్ ఉన్నారు.

విద్యుత్ సమస్య పరిష్కారం

సాక్షి ఎఫెక్ట్


డీటీఆర్‌ను బిగిస్తున్న సిబ్బంది

బోథ్: సొనాల మండలంలోని 1వ, 2వ వార్డుల్లోని దళితవాడలో గత కొన్ని నెలలుగా కొనసాగుతున్న విద్యుత్ అంతరాయ సమస్యకు ఎట్టకేలకు పరిష్కారం లభించింది. ఈనెల 2న ×విద్యుత్ సమస్యలు పరిష్కరించండి×శీర్షికన సాక్షిలో ప్రచురితమైన కథనానికి విద్యుత్ అధికారులు స్పందించారు. లైన్ ఇన్‌స్పెక్టర్ పవార్ లక్ష్మణ్ ఉన్నతాధికారులతో చర్చించి దళితవాడకు కొత్తగా హై వోల్టేజ్ డీటీఆర్ (డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్‌ఫార్మర్)ను ఏర్పాటు చేయించారు. దీంతో తరచూ ఏర్పడుతున్న విద్యుత్ అంతరాయాలకు శాశ్వత పరిష్కారం లభించింది. ఈ సమస్య పరిష్కారానికి చొరవ చూపిన 'సాక్షి'కి కాలనీవాసులు కృతజ్ఞతలు తెలిపారు. జూనియర్ లైన్‌మన్ పండిత్, సంతోష్, మోహన్, నర్సయ్య తదితరులు ఉన్నారు.

వీధి కుక్కల సమస్య పరిష్కరించాలి


కమిషనర్‌కు వినతిపత్రం ఇస్తున్న ప్రతినిధులు

కైలాస్‌నగర్: పట్టణ పరిధిలో వీధి కుక్కలు, మూగజీవాల సమస్యను పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని సార్కు మానవ హక్కుల సంఘం ప్రతినిధులు కోరారు. మంగళవారం మున్సిపల్ కమిషనర్ సీవీఎన్.రాజును కార్యాలయంలో కలిసి వినతిపత్రం అందజేశారు. వార్డుల్లో సంచరిస్తున్న వీధి కుక్కలు పిల్లలు, మహిళలు, కాలినడకన వెళ్లే ప్రజలపై దాడులకు పాల్పడుతూ భయభ్రాంతులకు గురిచేస్తున్నాయన్నారు. దాడుల్లో పలువురు ప్రాణాలను సైతం కోల్పోయారన్నారు. సుప్రీం కోర్టు ఆదేశాల మేరకు వీధి కుక్కలకు స్టెరిలైజేషన్ చేయించి, షెల్టర్‌హోంకు తరలించాలని కోరారు. పట్టణంలోని ప్రధాన చౌక్‌లతోపాటు రోడ్లపై సంచరించే పశువులను గోశాలకు తరలించేలా చూడాలని కోరారు. ఉమ్మడి జిల్లా జనరల్ సెక్రెటరీ ఉదయ్ కిరణ్, సత్రోజి వినయ్‌కుమార్, దుర్గే సూర్యకాంత్, దుర్వే ప్రదీప్ ఉన్నారు.

పులి సంచారంపై ఆందోళన వద్దు


పరిశీలిస్తున్న అటవీ అధికారులు

తలమడుగు: గ్రామాల శివారులో పులి సంచారంపై ప్రజలు ఎవరూ ఆందోళన చెందవద్దని ఎఫ్ఆర్వో గులాబ్‌సింగ్, బీఆర్ఓ ప్రమోద్‌కుమార్ అన్నారు. మండలంలోని లింగి, కుచులాపూర్, లక్ష్మింపూర్ గ్రామ శివారులోని అటవీ ప్రాంతాల్లో మంగళవారం పర్యటించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పులి సంచరించినట్లు ఆనవాళ్లు ఎక్కడా లేవన్నారు. అటవీ ప్రాంతాల్లోని పంట పొలాలు, గ్రామాలను సందర్శించినట్లు తెలిపారు. అడవి పిల్లి లేదా చిరుత పులి చంచరించి ఉండొచ్చు అని అన్నారు. బీట్ ఆఫీసర్ కృష్ణ, శరత్‌రెడ్డి ఉన్నారు.

అంత్యక్రియలు చేసి..మానవత్వం చాటి


అనాథ శవానికి అంత్యక్రియలు చేస్తున్న సభ్యులు

ఆదిలాబాద్: జిల్లాకేంద్రానికి చెందిన మానవసేవే మాధవ సేవా సమితి ప్రతినిధులు అనాథ శవానికి అంత్యక్రియలు చేసి తమ మానవత్వాన్ని చాటుకున్నారు. పట్టణంలోని శివాజీచౌక్‌లో శేఖర్ హోటల్‌లో మారుతి గత 8 ఏళ్లుగా పనిచేస్తుండగా అనారోగ్య కారణంతో సోమవారం మృతిచెందగా, టూటౌన్ పోలీసులు సమితి ప్రతినిధులకు సమాచారం అందించారు. మంగళవారం తిర్పెల్లి స్మశాన వాటికలో అంత్యక్రియలు చేశారు. హోటల్ యజమాని కనక శేఖర్, కనక అశోక్, సమితి ప్రతినిధులు చౌహాన్ శశికళ, కనక నర్సింగ్, చిందం దేవదాస్, సుధాకర్ రెడ్డి, శైలేంద్ర తదితరులు ఉన్నారు.

మైనార్టీల సమస్యలపై దృష్టి సారించాలి

ఆదిలాబాద్‌రూరల్: మైనార్టీల సమస్యలపై దృష్టిసారించాలని సేవా ఫౌండేషన్ జిల్లా అధ్యక్షుడు ఖ్వాజా సిరాజుద్దీన్ అన్నారు. నూతనంగా మైనార్టీ సంక్షేమ అధికారిగా బాధ్యతలు చేపట్టిన షేక్ కలీమ్‌ను మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా పెండింగ్‌లో ఉన్న ముస్లిం మైనార్టీల దీర్ఘకాలిక సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. రాజీవ్ యువ పథకం, మహిళా శక్తి, యువతకు స్వయం ఉపాధి శిక్షణ, ఉర్దూ కంప్యూటర్ సెంటర్ పునఃప్రారంభం, ఉర్దూ భవన్, మినీ హజ్ హౌస్ నిర్మాణం కోసం రూ.3 కోట్ల అమలు, తదితర అంశాలపై దృష్టి సారించాలని కోరారు. సభ్యులు ఇమ్రాన్ ఖాన్, ముహమ్మద్ జావిద్ అహ్మద్, అస్లాం ఖాన్, సాజిద్, సమీర్ ఖాన్, షేక్ ఇస్మాయిల్, మోహిద్ ఖాన్, తబ్రేజ్ ఖాన్ పాల్గొన్నారు.

వృత్తి నైపుణ్యాలు పెంపొందించుకోవాలి

ఆదిలాబాద్‌టౌన్: వృత్తి నైపుణ్యతను పెంపొందించుకొని ఆర్థికాభివృద్ధి సాధించాలని మిషన్ శక్తి సంకల్ప్ జెండర్ స్పెషలిస్ట్ కృష్ణవేణి అన్నారు. పట్టణంలోని న్యాక్ సెంటర్, ప్రభుత్వ సంజయ్‌గాంధీ పాలిటెక్నిక్ కళాశాలలో మంగళవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా కృష్ణవేణి మాట్లాడుతూ స్త్రీ, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో పది రోజుల పాటు ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మహిళలు సాధికారత వైపు ముందుకు సాగాలని సూచించారు. ముద్ర యోజన, సఖీ సర్వీస్ హెల్ప్ లైన్, ప్రధానమంత్రి కౌశల్ యోజన తదితర పథకాల గురించి అవగాహన కల్పించారు. జెండర్ స్పెషలిస్ట్ కోటేశ్వర్, నిఖిలేశ్వర్, న్యాక్ ట్రెనింగ్ సెంటర్ శిక్షకురాలు మేరి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా కాళోజీ జయంతి


ఆదిలాబాద్‌రూరల్: నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు


సైన్స్ డిగ్రీ కళాశాలలో..

ఆదిలాబాద్‌టౌన్/నేరడిగొండ/తాంసి/ఇచ్చోడ/ఆదిలాబాద్‌రూరల్/నార్నూర్/ఆదిలాబాద్: తెలంగాణ ప్రజాకవి కాళోజీ నారాయణరావు జయంతిని, తెలుగు భాష దినోత్సవాన్ని జిల్లావ్యాప్తంగా మంగళవారం ఘనంగా నిర్వహించారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆర్ట్స్ అండ్ కామర్స్, ప్రభుత్వ సైన్స్ డిగ్రీ, ఇచ్చోడ, నేరడిగొండ ప్రభుత్వ జూనియర్ కళాశాలలు, జిల్లా కేంద్రంలోని ఖానాపూర్ ప్రభుత్వ ఉన్నత, యాపల్‌గూడలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు, తాంసి ఎంపీడీవో, తహసీల్దార్ కార్యాలయాలు, పలుచోట్ల కాళోజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ నిజాం పాలనకు వ్యతిరేకంగా కాళోజీ పోరాటం చేశారని గుర్తు చేశారు. తెలంగాణ భాష ప్రాముఖ్యతను ప్రిన్సిపాళ్లు అతీఖ్ బేగం, సంగీత వివరించారు. మన భాషను మనం గౌరవించాలని సూచించారు. వైస్ ప్రిన్సిపాల్ రఘుగణపతి, ప్రిన్సిపాల్ శబాన తరన్నుమ్, సుదర్శన్, శంకర్, ఎంపీడీవో మోహన్ రెడ్డి, తహసీల్దార్ లక్ష్మి, లెక్చరర్లు, పాఠశాల హెచ్ఎం నిర్మలబాయి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు. నార్నూర్ బాలికల ఆశ్రమ పాఠశాల ఉన్నత పాఠశాలలో ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు అందుకున్న జాదవ్ విఠల్‌ను జీసీడీవో మెస్రం ఛాయ, ఎంఈవో పవార్ అనిత సన్మానించారు.

మంత్రి అడ్లూరిని కలిసిన ఆడే గజేందర్


మంత్రికి సమస్యలు విన్నవిస్తున్న ఆడే గజేందర్

నేరడిగొండ: రాష్ట్ర మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్‌ను కాంగ్రెస్ బోథ్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆడే గజేందర్ మర్యాదపూర్వకంగా కలిశారు. మంగళవారం హైదరాబాద్‌లోని మినిస్టర్ క్వార్టర్స్‌లో కలిసి పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. ఇటీవల బోథ్ నియోజకవర్గానికి నిధులు మంజూరు చేసినందుకు కృతజ్ఞతలు తెలిపారు. సానుకూలంగా స్పందించిన మంత్రి త్వరలో మరిన్ని నిధులు మంజూరుకు కృషి చేస్తానని తెలిపినట్లు పేర్కొన్నారు. నియోజకవర్గ యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు బద్దం పోతారెడ్డి, నాయకులు ఎండీ సద్దాం, మౌలానా తదితరులు ఉన్నారు.

వాగు దాటి..వైద్యం అందించి


వాగు దాటుతున్న వైద్యాధికారి సర్వరాజ్

ఆదిలాబాద్‌రూరల్: మండలంలోని బొప్పాపూర్, అసోద ఏజెన్సీ గ్రామాల్లో మంగళవారం అంకోలి పీహెచ్‌సీ ఆధ్వర్యంలో వైద్యశిబిరం నిర్వహించారు. అసోద గ్రామానికి వెళ్లే రోడ్డు మార్గంలో వాగు ఉండడంతో మండల వైద్యాధికారి సర్వరాజ్ వాగు దాటివెళ్లి వైద్యసేవలు అందించారు.

పశువులపాక దగ్ధం

భీంపూర్: మండలంలోని పిప్పలకోటి గ్రామంలో మంగళవారం మధ్యాహ్నం ప్రమాదవశాత్తు జరిగిన అగ్ని ప్రమాదంలో రెండు పశువుల పాక దగ్ధమైంది. అయిటీ రామదాసు, మారిశెట్టి వెంకటేశ్‌కు చెందిన పశువుల పాకతోపాటు వ్యవసాయ పనిముట్లు కాలిపోయాయి. అధికారులు బాధితులకు సాయం అందించాలని గ్రామస్తులు కోరారు.

సంక్షిప్త వార్తలు

ఘనంగా గణేశ్ నిమజ్జనం

బోథ్: మండలంలో గణేశ్ నిమజ్జనాన్ని ఘనంగా నిర్వహించారు. సోమవారం నిర్వహించిన శోభాయాత్రలో భక్తులు పాల్గొని గణనాథుడికి వీడ్కోలు పలికారు. మంగళవారం చెరువులు, వాగుల్లో నిమజ్జనం చేశారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

పీజీసెట్‌లో 68వ ర్యాంక్

ఇచ్చోడ: మండల కేంద్రానికి చెందిన గాయక్‌వాడ్ నగేశ్..పీజీ సెట్ ఫలితాల్లో రాష్ట్రస్థాయిలో 68వ ర్యాంక్ సాధించాడు. ఈ సందర్భంగా ఆయన్ను పలువురు అభినందించారు.

పరామర్శ

ఉట్నూర్‌రూరల్: మండలంలోని కన్నాపూర్‌కు చెందిన తాజా మాజీ సర్పంచ్ పెందోర్ జూగాదిరావు నాన్న కొన్నిరోజుల క్రితం మృతిచెందారు. మాజీ ఎంపీపీ, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పంద్ర జైవంత్‌రావ్ మంగళవారం బాధిత కుటుంబాన్ని పరామర్శించారు.

ఓటరు జాబితా సిద్ధం చేయాలి

బేల: స్థానికసంస్థలు, పరిషత్ ఎన్నికల దృష్ట్యా ఓటరు జాబితా సిద్ధం చేయాలని తహసీల్దార్ రఘునాథ్‌రావు పేర్కొన్నారు. తహసీల్దార్ కార్యాలయంలో ఓటరు జాబితాలో మార్పులు, చేర్పులపై బీఎల్‌వోలతో మంగళవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 18 ఏళ్లు నిండినవారు ఫారం-6 ద్వారా ఓటరుగా నమోదు చేయాలన్నారు. ఓటరు కార్డులో తప్పులు ఉంటే ఫారం-8 ద్వారా సరిచేయాలన్నారు. ఓటరు జాబితాలో మృతిచెందిన వారు ఉంటే తొలగించాలన్నారు. సమావేశంలో డిప్యూటీ తహసీల్దార్ సిడాం వామన్‌రావు, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ ఎండీ సాజిద్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాపతికుంట గ్రామం సందర్శన

ఉట్నూర్‌రూరల్: మండలంలోని కన్నాపూర్ పంచాయతీ పరిధిలోని ఉమపతి కుంట గ్రామాన్ని మాజీ ఎంపీపీ పంద్రా జైవంత్‌రావు సందర్శించారు. గ్రామంలో అపరిశుభ్రత, అపరిశుభ్రమైన నీళ్లు సేవించడం వల్ల గ్రామస్తులు రోగాల బారినపడుతున్నారన్నారు. ఆదివారం రాత్రి సోముగూడెంలో గిరిజనుడు జ్వరంతో బాధపడుతూ మృతి చెందిన అధికారులు పట్టించుకోలేదన్నారు. అనంతరం ఊరి పటేల్‌తో మాట్లాడి గ్రామసమస్యలను అడిగి తెలుసుకున్నారు. గ్రామంలో వైద్యశిబిరం నిర్వహించి వైద్య సేవలందేలా చూస్తానన్నారు. మాజీ సర్పంచ్, గ్రామస్తులు ఉన్నారు.

భీం ఆశయ సాధనకు కృషిచేయాలి

బోథ్: కుమురం భీం ఆశయ సాధనకు ప్రతిఒక్కరూ కృషిచేయాలని తుల శ్రీనివాస్ వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షుడు మాజీ ఎంపీపీ తుల శ్రీనివాస్ పేర్కొన్నారు. సొనాల మండలంలోని మారుమూల గ్రామాలైన మహధుగూడ, కేశవ్‌గూడ, పార్డి (బి), పార్డి (కే), ఘన్‌పూర్, టీవీటీ, పరుపులపల్లె గ్రామాల్లో మంగళవారం కుమురం భీం విగ్రహాల నిర్మాణ కోసం తుల శ్రీనివాస్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో ఆయన సొంత నిధులతో భూమి పూజ చేశారు. ఆగస్టు 9న ప్రపంచ ఆదివాసీ దినోత్సవం సందర్భంగా తాను ఇచ్చిన హామీని సరిగ్గా నెల రోజుల్లోనే భీమ్ విగ్రహాల నిర్మాణానికి భూమి పూజ చేయడం ఎంతో సంతోషంగా ఉందని తెలిపారు. రాయిసెంటర్ సర్మేడీ తొడసం లక్ష్మణ్, ఐటీడీఏ మాజీ డైరెక్టర్ మెస్రం భూమన్న, సర్పంచుల సంఘం అధ్యక్షుడు శ్రీధర్‌రెడ్డి, ఆదివాసీ నాయకులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సమస్యల పరిష్కార వేదిక

ఉట్నూర్‌రూరల్: ఉట్నూర్ విద్యుత్ శాఖ కార్యాలయంలో బుధవారం విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార వేదిక నిర్వహించనున్నట్లు డీఈ జాదవ్ సుభాష్, ఏఈ రాథోడ్ పృథ్వీరాజ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 నుంచి 11 గంటల వరకు నిర్వహించే ఈ కార్యక్రమానికి సీజీఆర్ఎఫ్ ఉన్నతాధికారులు హాజరవుతారని పేర్కొన్నారు. ఉట్నూర్‌తోపాటు నార్నూర్, ఇంద్రవెల్లి, సిరికొండ, గుడిహత్నూర్ మండలాల విద్యుత్ వినియోగదారులు తమ సమస్యలను నేరుగా అధికారుల దృష్టికి తీసుకువచ్చి పరిష్కరించుకోవాలని సూచించారు.

రోడ్డుకు మరమ్మతు

బోథ్: మండలకేంద్రంలో సోమవారం గణేశ్ నిమజ్జన శోభాయాత్ర సందర్భంగా భక్తులకు ఇబ్బంది లేకుండా స్థానిక నాయకుడు చట్ల ఉమేశ్.. రోడ్లకు మరమ్మతు చేయించారు. ప్రధాన రహదారులపై ఉన్న గుంతలను గ్రామస్తులు ఆయన దష్టికి తీసుకువచ్చారు. యువకుల విజ్ఞప్తిపై స్పందించిన ఆయన.. వర్షం కురుస్తున్నప్పటికీ పనులు పూర్తి చేయించారు.

తుడుందెబ్బ రాష్ట్ర ఉపాధ్యక్షుడికి సన్మానం


ప్రభాకర్‌ను సన్మానిస్తున్న న్యాయవాదులు

ఉట్నూర్‌రూరల్: తుడుందెబ్బ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా ఎన్నికైన ఉట్నూర్ న్యాయవాది పెందూర్ ప్రభాకర్‌ను మంగళవారం ఉట్నూర్ బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో న్యాయవాదులు సన్మానించారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు జి.బాపురెడ్డి, జనరల్ సెక్రటరీ బి.జైవంత్ రావు, కోశాధికారి కె.శ్రీనివాస్, న్యాయవాదులు సి.హెచ్ గిరి, పవార్ వసంత్‌రావు, కుడెల్లి అశోక్, నాతరి రాజు, జాదవ్ విశాల్, వినోద్, లక్ష్మీనారాయణ, అజర్, భాస్కర్ తదితరులు ఉన్నారు.